క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: పట్టణంలోని టౌన్–1 ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. టౌన్–1 ఏరియాలో విద్యుత్ లైన్ మరమ్మతు కారణంగా మటన్ మార్కెట్ నుంచి సత్యసాయి బాబా ఆలయం, బడా హనుమాన్, చోట హనుమాన్ ఆలయం వైపు వెళ్లే లైన్ వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

మంచిర్యాలటౌన్: సన్ అనిమల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గల రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు సరిపడా రక్తనిల్వలు బ్లడ్‌బ్యాంకులో తగ్గుముఖం పడుతుండడంతో, ట్రస్టు సభ్యులు 11మంది రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ గోపాల్, వైస్ చైర్మన్ శ్రావణ్ కుమార్, సభ్యులు సాయికుమార్, రవికుమార్, రాజేశ్, మధుకర్, ప్రదీప్ కుమార్, ఈశ్వర్ ప్రసాద్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

రేషనలైజేషన్ నిబంధనలు మార్చాలి

మంచిర్యాలఅర్బన్: రేషనలైజేషన్ జీవో నంబర్–25 నిబంధనలు మార్చాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి రాజావేణు డిమాండ్ చేశారు. అశాస్త్రీయమైన సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటుతో బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలన్నారు.

‘డ్రైవర్ పొరపాటు లేదు’

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో జరిగిన ప్రమాదానికి డ్రైవర్ తప్పిదమేమీ లేదని ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి శంకర్ అన్నారు. ఈ నెల 17న భీమిని మండలం పెద్దపేట్‌కు చెందిన లక్ష్మి నడవలేని స్థితిలో పాయింట్ వద్ద కూర్చొని ఉండటం.. సైడ మిర్రర్ పరిధిలో ఎవరూ కనబడకుండా ఉండటంతో ప్రమాదం జరిగిందని భావిస్తున్నామన్నారు. డ్రైవర్ పొరపాటు ఏమి లేదని, కానరాని స్థలంలో కూర్చుండి ఉండటం వల్ల వెనకాల టైరు కాలుపై నుంచి పోయిందని, దీనిని డ్రైవర్ తప్పుగా చూడలేదన్నారు. ఈ నెల 17న ప్రమాదానికి గురైన లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. పూర్తి విచారణ చేపట్టి డ్రైవర్ తప్పిదమని తేలితే చర్యలు తీసుకోవచ్చన్నారు.

రిజర్వేషన్ పునరుద్ధరించాలి

దండేపల్లి: ఏజెన్సీ గ్రామాల్లో ఎస్సీ వార్డు సభ్యుల రిజర్వేషన్ పునరుద్ధరించాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబు ను కలిసి వినతిపత్రం అందించినట్లు నాయకులు తెలిపారు. గతంలో ఏజెన్సీ గ్రామాల్లో ఎస్సీ వార్డు సభ్యుల్లో రిజర్వేషన్ ఉన్నప్పటికీ, దానిని 2018–19 జీపీ ఎన్నికల సమయంలో తొలగించారని, త్వరలో నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లో ఏజెన్సీ గ్రామాల్లో ఎస్సీ వార్డు సభ్యుల రిజర్వేషన్ పునరుద్ధరించాలని కోరినట్లు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాను, జాతీయ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజమల్లు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న గల్ఫ్ కార్మికులు

జన్నారం: మండలంలోని తపాలపూర్‌లో ఆదివారం గల్ఫ్ కార్మికులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏళ్లుగా గల్ఫ్ కార్మికులు ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్నారని, ప్రస్తుతం గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం హర్షనీయమన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం జీవో విడుదల చేయడంపై గల్ఫ్ కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తూ మహిళలు, పురుషులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గల్ఫ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు అశోక్, అధ్యక్షుడు సురేందర్, ఉపాధ్యక్షుడు జీవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్, కోశాధికారి ప్రభాకర్, నాయకులు గంగన్న, శంకర్, చంద్రశేఖర్ రెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..!

- బెల్లంపల్లి బల్దియాలో రోడ్డు పక్కనే చెత్త డంప్
- కంపువాసనతో ప్రజలు, ప్రయాణికుల అవస్థలు
- బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడంలేదని ప్రజల నుంచి విమర్శలు


గురిజాలకు వెళ్లే దారి పక్కన చెత్త కుప్పలు ఇలా...

బెల్లంపల్లి: పారిశుధ్యం నిర్వహణలో మున్సిపల్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు కనీస శ్రద్ధ లేకుండా పోయింది. ఎక్కడపడితే అక్కడ, రోడ్ల వెంట చెత్త కుప్పలు పోసి తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కనీస నియమాలు పాటించడం లేదు. ప్రజారోగ్యాన్నీ పక్కన పెట్టి, చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. బెల్లంపల్లి మున్సిపాలిటీలో రోజువారీగా 10 మెట్రిక్ టన్నుల వరకు చెత్త సేకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. సేకరించిన చెత్తను బెల్లంపల్లి నుంచి గురిజాలకు వెళ్లే రహదారిపై, ప్రత్యేకించి సమాధులపై కుప్పలు పోస్తున్నారు. అనధికారికంగా పోచమ్మ గడ్డ శ్మశాన వాటికను డంప్ యార్డుగా మలుచుకొని చెత్త పారబోస్తుండటంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

భరించలేని కంపు...

చెత్త కుప్పలు రోడ్డుపక్కన పేరుకుపోయి ఉండటంతో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. రోజుల తరబడి నుంచి చెత్త కుప్పలు నిల్వ ఉండటంతో పాటు చిరు జల్లులు కురిసినప్పుడు చెత్త నుంచి కంపు వాసన వచ్చి ముక్కుపుటలను అదరగొడుతోంది. బెల్లంపల్లి నుంచి దహెగాం, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, నెన్నెల మండలాల ప్రజలతో పాటు బెల్లంపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. వందలాది వాహనాలు నిత్యకృత్యంగా నడుస్తుంటాయి. జన సంచారం అధికంగా ఉంటుంది. అయితే రోడ్డు పక్కన పేరుకుపోయి ఉన్న చెత్త నుంచి వస్తున్న దుర్వాసనను వాహనదారులు, ప్రజలు భరించలేకపోతున్నారు.

చోద్యం చూస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడంలో మున్సిపల్ పాలకవర్గం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్థిరంగా డంప్ యార్డును ఏర్పాటు చేయడంలో, ప్రస్తుతం ఇష్టారాజ్యంగా పడేస్తున్న చెత్తకుప్పల నుంచి వస్తున్న దుర్వాసనను నివారించడంలో ఏమాత్రం చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదు. కంపు వాసనతో వాంతులు చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నా మున్సిపల్ అధికార యంత్రాంగంతో పాటు చైర్‌పర్సన్, ఇతర ప్రజాప్రతినిధులు ఆ సమస్య గురించి పట్టించుకున్న పాపానపోవడం లేదు. తాత్కాలిక ప్రాతిపదికన నిర్వహిస్తున్న డంప్‌యార్డు వైపు దృష్టి సారించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సర్వసాధారణంగా మారింది. అనధికారికంగా పడేస్తున్న చెత్తకుప్పల నుంచి కంపు వాసన వస్తుండటాన్ని ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని సమస్య లేకుండా చర్యలు తీసుకుని ప్రజారోగ్యాన్ని కాపాడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రోగాల బారిన పడితే బాధ్యత అధికారులదే...



మున్సిపాలిటీ ఏర్పడి 37ఏళ్లకాలం గడుస్తున్నా ఇంతవరకు డంప్‌యార్డు ఎక్కడ అనేది గుర్తించకపోవడం శోచనీయం. రోడ్ల వెంట, శ్మశాన వాటికల్లో చెత్తను డంప్ చేసి ప్రజారోగ్యాన్నీ నిర్లక్ష్యం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కనీస పట్టింపు లేకుండా వ్యవహరించడం సరికాదు. చెత్త కుప్పల నుంచి దుర్గంధం వ్యాపించడం నివారించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి.

– సురేష్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్

ఇరాక్ నుంచి ఇంటికి రప్పించండి..!

- అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా.. ఆదుకోండి
- స్వదేశానికి రప్పించేలా చొరవ తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి వేడుకోలు
- ఇరాక్‌లో దండేపల్లి మండలం మాదాపూర్ వాసి ఆవేదన


ఇరాక్‌లో గోపాల్..

దండేపల్లి: ఉపాధి కోసం ఇరాక్ దేశానికి వెళ్లిన ఓ యువకుడు అనారోగ్యంతో అవస్థలు పడుతున్నా.. కంపెనీ వారు ఇంటికి పంపడం లేదని ఆవేదన చెందుతున్నాడు. దండేపల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన సల్ల గోపాల్ ఏడాదిన్నర క్రితం ఇరాక్ వెళ్లాడు. అక్కడ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌లో పనిచేస్తున్నాడు. నెల రోజులకు పైగా అనారోగ్య సమస్యల(కాళ్ల లేవకుండా విపరీతమైన నొప్పులు)తో బాధపడుతున్నాడు. అక్కడి ఆసుపత్రులకు వెళ్లి చూపించుకున్నా నయం కావడం లేదు. ఇండియాకు వెళ్లి చూపించుకోవాలని అక్కడి వైద్యులు సూచించారని తెలిపాడు. ఆరోగ్యం బాగాలేదు ఇంటికి వెళ్తానని తాను పనిచేసే కంపెనీ కార్యాలయానికి వెళ్లి అడిగితే, పంపిస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారని గోడు వెళ్లబోసుకున్నాడు. జీతాలు కూడా సరిగ్గా ఇవ్వకపోవడం, ఇంటికి వెళ్తానంటే పంపించకుండా ఇబ్బందులకు గురిచేయడం, 800 డాలర్లు చెల్లిస్తే పాస్‌పోర్ట్ ఇస్తాం.. లేదంటే ఇవ్వమని బెదిరిస్తున్నారని వాపోయాడు. తెలంగాణ ప్రభుత్వం, గల్ఫ్‌సంక్షేమ సంఘాలు స్పందించి, తనను ఇంటికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని ఇక్కడి విలేకరులకు వీడియో సందేశం ద్వారా తెలియజేశాడు.

చిరుజల్లులకే చిత్తడి..

అటెన్షన్ ప్లీజ్..



నెన్నెల: మండల కేంద్రంలోని బ్యాంకు సమీపంలో సీసీ రోడ్డు మట్టి దారిని తలపిస్తోంది. చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీ రోడ్డు మీద మట్టి పేరుకుపోవడంతో చిరు జల్లులకే చిత్తడిగా మారుతుంది. రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో ఇలా రహదారి మధ్యలోకి వరద, మురుగునీరు చేరుతోంది. అధికారులు స్పందించి డ్రైనేజీ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని పలువురు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : శ్రీనివాస్, ఎంపీవో(నెన్నెల), ఫోన్ నంబర్ : 80198 05985

ఉక్కపోత.. దోమల మోత

- విద్యుత్ అంతరాయంతో జనం ఇబ్బందులు


అదనపు లైన్ నుంచి సప్లై ఇస్తున్న ట్రాన్స్‌కో ఏఈ, సిబ్బంది

వేమనపల్లి: తీవ్రమైన విద్యుత్ అంతరాయంతో మండల ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో మోస్తారు వర్షం కురిసింది. కొద్దిపాటి గాలి, దానికి తోడు వర్షం కురవడంతో మండలానికి సరఫరా నిలిచిపోయింది. అధికారులను వివరాలు అడిగితే.. చెన్నూర్ మండలం లంబాడితండా వద్ద పిడుగుపడి స్తంభాలకు ఉండే పది ఇన్సులేటర్లు పగిలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. రాత్రంతా విద్యుత్ సరఫరా లేకపోవడంతో దోమల సంచారం, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. విద్యుత్ అంతరాయం కారణంగా నిద్రలేక ఇబ్బందులు పడ్డారు. అర్ధరాత్రి ఏఈ దీక్షిత్, జేఎల్‌ఎం ఉదయ్‌కుమార్‌లు దేవులవాడ రూట్‌లో ఉన్న అదనపు విద్యుత్ లైన్ నుంచి ఆదివారం ఉదయం 4గంటల వరకు సరఫరా ఇచ్చారు. దీనికి తోడు లంబాడితండా వద్ద మరమ్మతు పూర్తి చేయడంతో ఉదయం పూట విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. తరుచూ రాత్రిపూట విద్యుత్ అంతరాయంతో జనం ఇబ్బందులు పడుతున్నారని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజన్ స్కానింగ్ సెంటర్ ప్రారంభం


ప్రారంభిస్తున్న ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బెల్లంపెల్లి చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విజన్ ఫిటోకేర్ స్కానింగ్ సెంటర్‌ను ఆదివారం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా విజన్ స్కానింగ్ సెంటర్ వైద్యురాలు అరుణ జ్యోతి మాట్లాడుతూ.. హైదరాబాద్ లాంటి మహానగరాల్లో లభించే అత్యాధునిక ఏ1 టెక్నాలజీతో ఆధునిక వసతులతో మన మంచిర్యాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వార్డు కౌన్సిలర్ మీనాజ్, చంద్రశేఖర్, గంగధర్, కృష్ణమూర్తి, రామస్వామి, వొడ్డె రాజమౌళి, తోట రవి, మారుతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లవాగు ప్రాజెక్ట్ కట్టపై బురదతో ఇబ్బందులు



భీమారం: మండల కేంద్రం సమీపంలో గల గొల్లవాగు ప్రాజెక్ట్ కట్టపై గల రోడ్డు బురదమయం కావడంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో సందర్శకులతో పాటు పొలాల వద్దకు వెళ్లేందుకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. దాదాపు కిలో మీటరు పైగా మట్టిరోడ్డు ఉండడంతో వర్షం కురిసినప్పుడల్లా బురద ఏర్పడుతోందని వాపోతున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో కట్టపై సీసీ రోడ్డు నిర్మిస్తామని, అప్పట్లో అధికారులు ప్రకటించారు. కానీ ప్రాజెక్ట్ నిర్మించి 15ఏళ్లు గడుస్తున్నా, మట్టి రోడ్డుకే పరిమితం అయిందని వారు తెలిపారు. ప్రాజెక్ట్ కట్టపై ఎర్రమట్టి వేయడంతో అధిక వర్షాలతో బురద మరింత ఎక్కువగా ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని, సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన విద్యావిధానాన్ని అమలు చేయాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

చెన్నూర్: ప్రాథమిక విద్యా బలోపేతం కోసం ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాస్‌రావు అన్నారు. స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీ చేసిన ఉత్తర్వులు సహేతుకం కాదని, వెంటనే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలన్నారు. 20మంది విద్యార్థులకు ఒక టీచర్, 50మంది విద్యార్థులకు ఉన్న ప్రాథమిక పాఠశాలకు ఒక హెచ్ఎంను నియమించాలన్నారు. సమావేశంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి సాంబయ్య, నాయకులు నాగరాజు, చందు, ప్రవీణ్‌కుమార్, సునీల్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పలు కాలనీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే, ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్, ఐకేపీ సిబ్బంది, విద్యారులు పాల్గొన్నారు.

కొత్తగూడంలో పల్లెనిద్ర


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై శ్యాంపటేల్

వేమనపల్లి: మండలంలోని కొత్తగూడం గ్రామంలో శనివారం పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. సైబర్‌నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రంక్ డ్రైవ్ వల్ల కలిగే ప్రమాదాల గురించి ఎస్సై శ్యాంపటేల్ గ్రామస్తులకు తెలియజేశారు. వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ నెల 21నుంచి అక్టోబర్ 20వరకు మావోయిస్టు పార్టీ సంస్థాపన వారోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వచ్చిపోయే వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వారి గుర్తింపు వివరాలు తెలుసుకొని పంపించారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): రామకృష్ణాపూర్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో 2001–02వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.



మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర హైస్కూల్లో 2000–01 వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ఫాం హౌజ్‌లో అ‘పూర్వ’ సమ్మేళనం నిర్వహించారు. 24ఏళ్ల తర్వాత ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఒక చోట కలుసుకోవడంతో ఒకరినొకరు పలుకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను జ్ఞాపికలు అందించి సన్మానించారు.

మూలనపడ్డ ‘స్ప్రే డ్రోన్’



మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ ఐకేపీ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో డ్రోన్ స్ప్రే యంత్రాన్ని కొనుగోలు చేసి, మహిళా సంఘాల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచారు. కొన్ని రోజులు ఉపయోగంలోనే ఉన్నా, ఇప్పుడు మూలనపడేసి ఉంచారు. డ్రోన్ బ్యాటరీలు పనిచేయకపోవడంతో ప్రస్తుతం ఈ విలువైన యంత్రం వినియోగంలో లేకుండాపోయింది. రూ.70వేలు ఖర్చు చేసి కనీసం ఈ సీజన్‌లోనైనా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

24న యోగా ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: మందమర్రి లిటిల్ ఫ్లంబర్ స్కూల్‌లో అండర్–14, 17బాలబాలికలకు 24న జిల్లా స్థాయి యోగా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణిరాజా తెలిపారు. ప్రతి విభాగంలో ఐదుగురు క్రీడాకారులను ఆర్టిస్ యోగా–1, రిథమిక్ యోగా–1 క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు కుమార్ 9948608598, 7680873626లో సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం

చెన్నూర్: చెన్నూర్‌లోని కొటబొగుడ కాలనీకి చెందిన బొగుడమీది సంతోశ్(38) అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సంతోశ్ మృతి చెందడంతో వృద్ధురాలైన తల్లి ఒంటరైంది. ఆర్థిక పరిస్థితి బాగాలేక పోవడంతో మృతుడు సంతోశ్ బాల్య మిత్రులు 1997–98 పదో తరగతి బ్యాచ్ తరఫున రూ.21వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పురేళ్ల శ్యాంసుందర్, బిల్లా తిరుపతయ్య, పిల్లలమర్రి రాము, బొడ్డు గోపికృష్ణ, పోలోజు మహేశ్ పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన రైతు అశోక్ సాగు చేసిన పత్తి పంటను ఓ ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులు ఆదివారం క్షేత్ర సందర్శన చేపట్టారు. రైతులకు పత్తి పంటలో మెలుకువలు, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కంపెనీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామానికి చెందిన దుర్గం ఇట్టయ్యకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ రూ.18వేల చెక్కును అతడి కుమారులకు మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ అందజేశారు.

ఆలయానికి విరాళం

జన్నారం: మండలంలోని కవ్వాల్‌లో నూతనంగా నిర్మిస్తున్న చిలుకలయ్య ఆలయానికి నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ నేత రూ.5016విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, మల్లేశ్, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.